# విస్తరి

నాగి నీడ చూసుకున్నాడు: పన్నెండు కావచ్చిందనిపించింది అడుగులు చకచకా సాగాయి. మలుపు తిరిగాడు ఎత్తరుగుల ఇంటి దగ్గర ఎవరో తారట్లాడుతున్నట్లు తోచింది. కంటికి చేయి అడ్డం పెట్టుకుని నిమాగా చూశాడు నిజమే ఎవరో కుర్రాడున్నాడు. ఆవేళప్పుడు అక్కడ తానే వుండాలి ఆది కట్టుబాటు.

కొన్ని ఇళ్ళలో భోజనానికి విస్తళ్ళు వాడే పద్ధతి ఇంకా పోలేదు: విస్తట్లో అల్ప ప్రాణుల కోసం ఉచ్ఛిష్టంగా కొంత అన్నం, ఆధరువు విడిచిపెట్టడం పరిపాటి. ఆ ఇంట్లో అద్దెకుంటున్నాయన తల్లిదండ్రులు వయస్సు మళ్ళినవాళ్ళు. వేళపట్టున భోజనం చేయడం అలవాటు. ఒక పొద్దే భోజనం. రాత్రిపూట పిండో, పండో వుంటే చాలు

నాగి అరుగు దగ్గర కొచ్చాడు. అరుగు పక్కగా తనకంటే తక్కువ ఈడున్న కుర్రాడు బిక్కుబిక్కుమంటూ నుంచున్నాడు. అంతకు ముందెప్పుడూ అతణ్ని చూడలేదు. నాగికి ఆశ్చర్యం వేసింది.

ఎండ చుర్రుమంటోంది. కడుపు నకనకలాడుతోంది. విస్తళ్ళ బయట పారేసే వేళయింది. వీణ్ని ఇక్కడుంచితే దొరికే ఆ రెండు ముద్దలూ దక్కవు. తీవ్రంగా చూశాడు.

"నీ పేరేమిటి?"

"రంగా"

"ఎక్కడుంటావ్?"

"చెరువు కట్టమీద తుమ్మచెట్టు కింద"

"మరి ఇక్కడికెలా వచ్చావు?"

"నిన్న దూరాన్నుంచి చూశా.... అమ్మగారు ఈవేళప్పుడు విస్తరి పడేయడం. నువ్వు తింటం చూశా" జాలిగా చెప్పాడు.

"నువ్వొస్తే నాకెట్టా?" కోవం పులుముకున్నదా ప్రశ్న.

"ఆకలవుతోందన్నా" కంఠంలో మాటలకందని వేదన.

వదేళ్ళన్నా నిండని నాగి చెవులకు సముద్రాలన్నీ ఒక్కసారే పొంగిన హోరు వినిపించింది. పధ్నాలుగు లోకాలు ఫెటిల్లుమని బద్ద లయినట్లు తోచింది.

"ఆకలవుతోందన్నా" ఈ మాటలు ప్రళయ భీకరంగా ప్రతి ధ్వనించాయి.

లోకం తెలియని నాగి ఆకలి గురించి అంతా తెలిసిన సర్వజ్ఞుడు ఆకాశమంత ఎత్తు ఎదిగాడు. వాడి మనసు విశ్వమంత విస్తారమయింది. వాడిలో పదిమంది సంతానం కన్న తల్లి గుండె అమర్చినట్లయింది.

"తమ్ముడూ" వాణ్ని పొదివి పట్టుకున్నాడు.

"ఇవ్వాళ్ళనుంచి విస్తళ్ళు నీకే ఇమ్మని చెబుతా అమ్మగారితో"

"అన్నా... నీకో" అనుబంధం నింపుకుంది కంఠం.

"నాకా... పర్వాలేదు" వేదాంతిలా హామీ ఇచ్చాడు.

"వద్దు. చెరో విస్తరి తీసుకుందాం"

"నువ్వు చిన్నవాడివి రెండు విస్తళ్ళలో వచ్చివి రెండు మూడు ముద్దలే. నువ్వు తిను ... నేనెక్కడికయినా వెళ్తా"

"నేనే వెళ్ళిపోతా"

"నామాట విను" బతిమాలుతున్న మార్దవం వుంది ఆ మాటలో. ఇంతలో తలుపు తెరుచుకుంది ఇద్దరి కళ్ళూ అటు తిరిగాయి.

ఆమె చేతిలో చుట్టిన విస్తళ్ళు లేవు.

నాగి కళ్ళే నులుముకు చూశాడు. తనను తాను నమ్మలేక పోయాడు. కళ్ళల్లో నిరాశ గూడు కట్టుకుంది. తనమాట ఎలావున్నా తనకంటే చిన్నవాడు వీడి ఆకలి ఎలా కల్లాఉతుంది.

ఆమె అరుగు పైకి వచ్చింది.

"అబ్బి.... వీడెవడూరా?" ఆప్యాయంగా అడిగింది.

"మా తమ్ముడండి" గుండెలోతుల్లోంచి వచ్చిందా సమాధానం.

"ఎప్పుడూ కనిపించలేదేరా అబ్బి?"

"ఇంటి దగ్గరుంటారమ్మగారు" ఏదో తెలియని అనుబంధం గురించి చెబుతున్నట్లుంది.

"ఇప్పుడే వస్తానుండర్రా అబ్బి"

"ఆమె ఇంట్లోకి వెళ్ళింది.

రంగా కళ్ళు నాగి వైపు తిరిగాయి. ఆకలి మంటలు ఆ కళ్ళల్లో భుగభుగమంటున్నాయి.

"అమ్మగారు విస్తళ్ళు పారేసేందుకు తెస్తారు" సముదాయిస్తున్నటు చెప్పాడు. ఏకోదరులు కాకపోయినా కడుపులో ఆకలి బాద ఒక్కటే.

అమ్మగారు వచ్చేరు.

ఒక పళ్ళెంలో రెండు విస్తళ్ళు అన్నం కూరలతో వున్నాయి. పెద్ద చెంబులో మంచినీళ్ళున్నాయి

నాగి రంగా అంత అన్నంవున్న విసరి చూడటం అదే మొలటి సారి ఏమీ అర్థంకాలేదు. రోజూ నాగి తీసుకునేది తిని పారేసే విస్తళ్ళు.

"వట్టంరా అబ్బీ! చిన్నబ్బీ నువ్వూ రారా" అన్నపూర్ణ మాట్లా, దినట్లుందా పిలుపు

చిన్న చేతులు చాలవని చింపిరి చొక్కాలు పట్టారు.

"తినంరా ...మంచినీళ్ళు పోస్తా"

"అమ్మగారూ! ఇంత అన్నం ఒకేసారి తినడం చేతకాదు. ఇంటి దగ్గర అమ్మావాళ్ళున్నారు" నాగి అన్నాడు.

అలాగే అన్నట్టు రంగా తల ఆడించాడు.

"చూడరా అబ్బీ? మాఅబ్బాయికి బదిలీ అయిందిరా! ఇవ్వేళే వెళ్ళి పోతున్నాంరా'' ఆమె కంఠం రుద్ధ మయింది.

నాగి నెత్తిమీద నూను పిడుగులు పడి నట్లనిపించింది.

"మంచిదమ్మగారూ" అతని గొంతుతడి ఆరిపోయింది.

నమస్కరిస్తున్నట్లు తలవంచి బయలు దేరాడు రంగా వెనకనే నడిచాడు.

ఆమె అరుగుమీద నుంచుని వాళ్ళు నెమ్మదిగా వెళ్ళడం చూస్తోంది కళ్ళు నీళ్ళతోనిండంటంలో వాళ్ళ రూపాలు అలుక్కుపోయాయి.